# కరణం ధర్మయ్య

కొన్ని సంవత్సరముల క్రితము ధర్మయ్య అనే ఆయన భావనగరానికి కరణంగా వుండేవాడు. పేరు ధర్మయ్య అయినా పిల్లికి బిచ్చము పెట్టని మనిషి. తను ధర్మము చెయ్యకపోగా బీద ప్రజల వద్దనుండి మామూళ్లు అనే పేరుతో డబ్బు గుంజుతూ, పీడిస్తూ వుండేవాడు.

ఒక రోజున ఒక పండితుడు ఆ వూరికి వచ్చాడు. ఆ వూరి పెద్దలందరివద్ద వారలు యిచ్చిన డబ్బు ప్రోగుచేసుకొన్నాడు. షుమారుగా 200-0-0 వరకు అయింది. ఆశకు మితము అనేది వుండదుకదా — యింకా కొంత దండి పెద్దమనుష్యులను చూచిన వాళ్లకు తోచిన పైకము యిత్తురనే ఆశతో కరణంగారివద్దకు వెళ్లాడు. వారికి తోచిన సహాయం చేయవలసినదిగా ప్రార్థించాడు.

మన కరణంగారి సంగతి తెలుసుగా — రాబట్టటమే తెలుసుగాని యివ్వటము అనేది ఆయన జన్మలో తెలియదు. కాసేపు ఆలోచించి ఆ పండితునితో చెప్పాడు. "మీరు పెద్దలు. మరియు పండితులు. మిమ్ములను సత్కరించుటలో మా గ్రామస్థులతోపాటు నేనుగూడ తప్పక పాలుపంచుకుంటాను. కాని దానికన్న ముఖ్యమైనది యింకొకటి వున్నది. ఈ వూరిలో వసూలైన మొత్తములో రూపాయికి 0-1-0 చొప్పున కరణమునకు యివ్వటం ఆచారం. దాని ప్రకారం మీకు రు. 200-0-0 లు వసూలైనదిగాన రు. 12-8-0 లు నాకు రావలసివున్నది. అందులో పండిత దక్షిణగా నేను యివ్వదలచుకొన్న అయిదు రూపాయలు పోను మిగతా 7-8-0 మీరు చెల్లించుకు వెళ్లవలయును."

విన్నాడు పండితుడు — ఆ రెండు వందలతో సంతుష్టి పడి పోకుండా యిచ్చుటకి ఎందుకు వచ్చితినా అని విచారపడ్డాడు. కాని చేయుటకు ఏమియు వుపాయము తోచలేదు. కరణం ధర్మయ్య అంటే సామాన్యుడా — యివ్వక తప్పిందిగాదు. రు. 7-8-0 చెల్లించి తక్షణం సెలవు తీసుకొనిపోయాడు ఆ పండితుడు.

అదేసమయములో ధర్మయ్యగారి భార్య వచ్చి ఎద్దావు దావు బ్రతుకులలో వున్నదని, ధర్మయ్యగారిని వచ్చి చికిత్స చేయించమని చెప్పింది. వెంటనే ధర్మయ్యగారు దగ్గరలో వున్న వెట్టివానిని కేక వేసి రు 7-8-0 చెల్లించుకుని వెళ్లిన పండితుని పిలుచుకు రావలసినదిగా చెప్పాడు. పండితుడు దాదాపు వూరి పొలిమేరవరకు వెళ్ళాడు. మళ్ళా ఈ వార్తవిని వెళ్ళటమా-మానటమా అని తటపటాయించి కరణం ధర్మయ్యగారి మాటకాదంటే దగ్గర వున్న పైకంగూడా దక్కదనే వుద్దేశ్యంతో తిరుగువచ్చాడు.

ఆవు యింకా చావలేదు - ఎక్కువ గంటలు బ్రతకదుగూడ. పండితుడు వచ్చినదే తడవుగా తిలలు తెప్పించి ఆ గోవును, ఆ పండితోత్తమునకు దానము చేశాడు. ఈ అసామాన్య దాతృత్వమునకు పండితుడు ఆశ్చర్యముతో తన అదృష్టమును పొగడుకొనుచు ఆ గోవును తోలుకొని పోవు సన్నాహములో పలుపు కొని తెచ్చుటకై అంగడికి వెళ్లెను. ఈలోపుగా గోవు చనిపోయెను. ఇంకను బేరమాడుచున్న పండితుని కబురుచేసి వెంటనే గోవును బయటకు తీసుకుపోవలసినదిగాను, లోకన మామూలు నాలుగు రూపాయిలు చెల్లించవలసినదిగాను హుకుంచేశాడుధర్మయ్యగారు. దాదాపు గుండెఆగిపోయినంతపనైనది ఆ పండితోత్తమునకు. నోట్లోనుండి మాటగూడ పెగిలి రావటంలేదు. కొంతసేపటికి తెలివి తోకివచ్చి కరణంగారియింటికి వచ్చుటయే తన దురదృష్టమని వగచి వూరిలో కొందరుమనుష్యులను బ్రతిమాలి తీసుకువచ్చి గోవును బయటకు తీసుకు రావటము - లోకన మామూలు కరణంగారికి

చెల్లించటం జరిగిపోయింది. ఈ మామూళ్లు కూలి పైకము యిచ్చుకునిపోగా మిగిలిన పైకముతో వెనుకకు తిరుగనైనా తిరుగకుండా పోయాడు ఆ పండితుడు.

ఈవిధముగా ధర్మయ్య అన్యాయములకు పాల్పడుతూ ఆవూరివారందరితోను విరోధము కొని తెచ్చుకున్నాడు. ప్రతివారు ధర్మయ్య వద్దకు వెళ్లుటకు భయపడేవారు. ఇట్లా ఉండగా ధర్మయ్య మంచానపడ్డాడు. అవసానకాలము దగ్గరకు వొచ్చింది. తను చేసిన పాపములన్నీ నెమరు వేసుకొన్నాడు. తను ఎక్కువ కాలము బ్రతకనని నిశ్చయించుకొని ఆవూరి పెద్దలను పిలుపనంపాడు.

ధర్మయ్య దగ్గరకు పోవటం అంటే మాటలా కాని ఇప్పటి ధర్మయ్య పూర్వపు ధర్మయ్య కాదు - ప్రస్తుతం ధర్మయ్య చావు బ్రతుకుల ధర్మయ్య. చనిపోయే వానిని సాధించే దేమిటి అనే తలంపుతో ఆ వూరి పెద్దలు కరణంగారిని చూచేటందుకు వెళ్లారు.

పాపము అవసానదశలో వున్నాడేమో - వూరి పెద్దలందరికీ అప్పగింతలు చెప్పాడు – అంతటితో ఆగలా! తను ఒక కోరిక కోరతానని అది చేస్తామని వాగ్దానము చేయవలయునని ఆ పెద్దలను కోరాడు. కరణంగారితో సంబంధము కొరివితో తల గోక్కొనటముతో సమానమని వారలకు తెలుసు. కాని అవసానదశలో వున్న వానికోరికలు స్వల్పముగా వుండునని తలచి పెద్దలంతా మాట యిచ్చారు. దానిపై కరణంగారు కోర్కె బయలుపరచారు. "తాను సన్యాసము స్వీకరించాలని వున్నదని - తనకు ఒక సమాధిని కట్టించి సమాధి చేయవలయునని." పెద్దలు చూడవచ్చిన వారంతా ఆలోచించారు. సమాధి కట్టటమంటే మాటలా? కనీసం రు 100-0-0 అయినా కావాలి. చివరకు వారంతా దానికి అంగీకరించారు—సంతోషించారుగూడ! ఆనాటితో పీడ విరగడైపోతుందని. సమాధి చేశారు కరణం ధర్మయ్యను.

అది యమలోకం—పాప పుణ్యములు చేసిన వారలకు ఫలితములు యిచ్చే లోకం. యమధర్మరాజు చిత్రగుప్తుడు, కింకరులు ఆసీనులై వున్నారు. చనిపోయిన వారందరు వస్తున్నారు. ఫలితములను అనుభవించుచున్నారు.. మన ధర్మయ్యగారి వంతువచ్చింది. చిత్రగుప్తుడు ఖాతా పూర్తిగా తిరుగవేసి, అతను చేసినవన్నీ పాపములే అని, పుణ్యకార్యములు ఏవియు చేసి ఎరుగడని, తగువిధముగా శిక్షించవలసినదిగా ధర్మరాజుకు విన్నవించుకున్నాడు.

మన ధర్మయ్య చిత్రగుప్తుడు చెప్పినదంతా విన్నాడు. చాల కోపము వచ్చిందాయనకు తప్పుడు లెఖలు వ్రాసినందులకు నిందించాడు. మరల తన ఖాతాను చూడమని కోరాడు. కాని మన ధర్మయ్య పంతులు ఏదైనా పుణ్యకార్యము చేస్తేగా. ఎక్కడా చిత్రగుప్తుని దృష్టిలో అందలేదు, ధర్మయ్య చేసిన పుణ్యకార్యము.

చివరకు ధర్మయ్య తను చేసిన పుణ్యకార్యములను వల్లించాడు, గోదానము చేసినట్లు, పండితులను గౌరవించినట్లు, మరియు సర్వసంగపరిత్యాగము చేసి సన్యాసాశ్రమము స్వీకరించి, సమాధిలో చేరినట్లు. ధర్మరాజు, ధర్మయ్య చేసిన వినతిని పరిశీలించి ధర్మయ్య, ఒకపాలు పుణ్యము 99 పాళ్లు పాపము చేసినట్లు తీర్పు యిచ్చాడు. ఏది మొదట అనుభవించవలయుననే విషయం ధర్మయ్యనే కోరుకోవలసినదని తీర్పు చెప్పాడు.

జమకాక ఖర్చు కోరని ధర్మయ్య మొదట పుణ్యఫలము అనుభవించెదనని విన్నవించుకొని పుణ్యలోకమునకు పోయి పరిమిత కాలము సుఖము అనుభవించాడు.

పుణ్యఫలము అయిపోయింది. పాపఫలము అనుభవించేరోజు వచ్చింది. యమధర్మరాజు వద్దనుండి వర్తమానము వచ్చింది. ధర్మయ్య సామాన్యుడా! యమధర్మరాజునే రావలసినదిగా తిరుగు చెప్పి కింకరులను పంపివేశాడు. తప్పుతుందా! యమధర్మరాజు ధర్మయ్యను యమలోకమునకు తీసుకు వెళ్లుటకు వచ్చాడు. కాని ధర్మయ్య యమధర్మరాజుకు విన్నవించుకున్నాడు. తను చేసిన పాపము బాకీ ఏమియు లేదని తన పాపములన్నియు పుణ్యలోకములో పుణ్యపురుషులను, యమధర్మరాజును చూచుటచే హరించిపోయినవని వాదించాడు. నిజమే పుణ్యలోకములో దేవత్వము కల్గిన పురుషులను చూడగల్గుట పాపికి ఎట్లు సంభవించును? యమధర్మరాజుకు ప్రత్తోవా దొరకక, యమలోకానికి తిరుగుదోవ పట్టాడు వొంటరిగా. ★